## క్లుప్తంగా

### సత్యదేవుని దర్శించిన ప్రముఖులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని సత్యనారాయణస్వామిని శనివారం రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే దంపతులు దర్శించి, పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శివశంకరరావు సత్యదేవునికి పూజలు చేశారు. వారికి స్వామివారి ప్రసాదాలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

### కోనేరుగా చెరువు అభివృద్ధికి సన్నాహాలు

గండేపల్లి: పంచాయతీ ఎదురుగా ఉన్న చెరువును అభివృద్ధి చేయనున్నట్టు ఎంపీడీఓ కె.చంద్రరావు గండేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తీరణలో భాగంగా మధ్య నుంచి రోడ్డు రావడంతో నాటి నుంచి చెరువు నిరుపయోగంగా మారింది. దశమి, కార్తీక మాసంలో భక్తుల సౌకర్యార్థం దీపారాధనలకు అనుకూలంగా కోనేరుగా అభివృద్ధి చేయనున్నట్టు ఆయన తెలిపారు. శనివారం ఆయన చెరువును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్, కార్యదర్శి ఫణీంద్ర, గ్రామస్తులు రామకృష్ణ పాల్గొన్నారు.

### పోలమ్మతల్లికి పూజలు

గండేపల్లి: శ్రావణ బహుళ అమవాస్య శనివారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పలువురు భక్తులు పోలాలమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు కంద మొక్కలకు పూజలు నిర్వహించి వాయు కుడుములు నైవేద్యంగా సమర్పించి సంతానాన్ని ప్రసాదించుతల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు.

### ఘనంగా ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శ్రావణ అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. వనదుర్గ అమ్మవారికి పూజల అనంతరం వేద పండితులు హోమం ప్రారంభించారు. వనదుర్గ అమ్మవారికి నిర్వహించిన హోమంలో 40 మంది భక్తులు పాల్గొన్నారు.

### ముదునూరి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరానికి చెందిన బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన యాళ్ల ఏసు అత్తయ్య అనారోగ్యానికి గురయ్యారు. ఆమె కాకినాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మురళీకృష్ణంరాజు ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా మండలాభిషేక మహోత్సవం



రాచపల్లి అరుణాచలక్షేత్రంలో నాయనార్ల విగ్రహాల ఊరేగింపు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచల క్షేత్రంలో వైభవంగా మండలాభిషేక మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అరుణాచల మాధవి ఆధ్వర్యంలో అరుణాచల క్షేత్రంలో ప్రతిష్ఠించిన మహాశివ భక్తులు 63 నాయనార్లు, దక్షిణామూర్తి, లక్ష్మీహయగ్రీవులు, సూర్యభగవాన్, కాల భైరవ, భారతమాత, గంగా మాతల విగ్రహాలకు మహా మండలాభిషేకాన్ని నిర్వహించారు. మహాశివ భక్తుడు తిరువారూ కుమార్ అయ్యార్ సారథ్యంలో వేద పండితులు హోమాలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అరుణాచల మాధవి నాయనార్ల జీవిత చరిత్రను ప్రవచనం చేశారు. ఆలయ ప్రాంగాణంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మహా శివ భక్తులైన 63 నాయనార్ల విగ్రహాలను ఊరేగించారు. తిరువారూ కుమార్ అయ్యార్‌ను ఘనంగా సన్మానించారు. పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక క్రతువులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకుడు నాగ సాయినాథ్, గణేషుల లచ్చబాబు, రాంబాబు పాల్గొన్నారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలకు అపార నష్టం

- ముంపు నీటిలోనే పంట పొలాలు
- తక్షణ సస్యరక్షణ చర్యలే రక్ష
- వర్షం నీటిని పొలాల నుంచి తొలగించాలి
- రైతులకు ఉద్యానశాఖాధికారుల సూచనలు

ప్రత్తిపాడు: నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు ఉద్యాన పంటలు నీట మునిగాయి. మరి కొన్ని రోజుల పాటు వరద ముంపులో ఉంటే వేళ్లు కుళ్లి పంట పాడయ్యే ప్రమాదముంది. మడుల్లోంచి నీటిని బయటకు పంపి, సస్యరక్షణ చర్యలు చేపట్టితే పంట నష్టాన్ని అరికట్టవచ్చని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. ప్రత్తిపాడు మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, లంపకలోవ, పెద శంకర్లపూడి, పోతులూరు, వాకపల్లి తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో టమాటా, వంగ, మిరప, తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి పంట సాగు చేపట్టారు. మూడు రోజుల పాటు ఏకబిగిన కురిసిన భారీ వర్షాలకు ఒమ్మంగి, రాచపల్లి తదితర గ్రామాల్లోని మిరప, వంగ, టమాటా తదితర గ్రామాల్లోని సుమారు 150 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. అధిక వర్షాల ప్రభావం వల్ల తెగుళ్లు సోకే ప్రమాదముందని ఉద్యానశాఖాధికారి కె. దివ్యశ్రీ చెబుతున్నారు.

**పంటలపై అధిక వర్షాల ప్రభావం**

భారీ వర్షాల కారణంగా వరద నీరు ముంచెత్తినప్పుడు పొలాల్లో పంటలు మొలక శాతం తగ్గడం, విత్తనం, వేర్లు, నీటిలో మునిగిన ఆకులు, మొక్కలు కుళ్లిపోవడంతోపాటు పోషకాల లభ్యత తగ్గుతుంది. సేద్యపు పనుల్లో ఆలస్యం, కలుపు బెడద ఎక్కువగా ఉండడం, పరాగ సంపర్కం తగ్గి దిగుబడి తగ్గుతుంది, చీడ పీడల బెడద పెరుగుతుంది.

**కూరగాయల పంటలపై అధిక ప్రభావం**

టమాట మొక్క ఎదుగుదల తగ్గటం, పూత రాలటం, ఎండు, ఆకుమచ్చ తెగులు, కాయకుళ్లు, వంగ మొక్కల ఆకు పసుపు రంగులోకి మారడం, పూత రాలిపోవడంతోపాటు అక్షింతల పురుగు, బ్యాక్టీరియా మచ్చ తెగులు, కాయ కుళ్లు అధికమవుతుంది. మిరప పంటలో నారు కుళ్లు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు, కోయనోఫోరా తెగులు కనిపిస్తుంది. తీగజాతి కూరగాయల్లో ఆకు పసుపుబారటం, అక్షింతల పురుగు, పండు ఈగ, బూజు తెగులు, బూడిద తెగులు అధికమవుతుంది. ఆకుకూరలు మొక్క మొదలు కుళ్లు, ఆకు తినే పురుగు, ఆకుమచ్చ తెగులు, దుంప జాతి మొక్కల్లో దుంప కుళ్లు, అధిక శాఖీయోత్పత్తి కనిపిస్తుంది.

**యాజమాన్య పద్ధతులు**

పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపివేయాలి. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను పిచికారీ చేయాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసాయనిక ఎరువులను చల్లుకోవాలి. అధిక వర్షాలకు విత్తనం మొలకెత్తినప్పుడు లేదా, లేత మొక్కలు దెబ్బ తిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకుని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసే కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలి. మొక్కలకు ఊతం ఇవ్వడం, పందిళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవాలి. పాలీహౌస్‌లలో అధిక వర్షాల నుంచి రక్షణ కలుగుతుంది. షేడ్ నెట్లలో వర్షాకాలంలో సాగు కష్టం.



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ముంపు నీటిలో మిరప పంట

**సస్యరక్షణ చర్యలు**



అన్ని కూరగాయల పంటలకు పొగాకు, లద్దెపురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. వంగ, కాకర, ఆగాకర పంటలకు సోకే అక్షింతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి 2 మి.లీ లేదా లీటరు నీటికి ఒక గ్రాము థయోడికార్బ్ పిచికారీ చేసుకోవాలి. మిరప, టమాట, క్యాబేజీ తదితర పంటలకు సోకే ఎండు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా లీటరు నీటికి 2 గ్రాముల మంకోజెబ్, మెటాలాక్సిల్‌ను కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. మిరప, టమాట, చిక్కుడు, ఆకుకూరలకు సోకే ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా లీటరు నీటికి 205 గ్రాముల మంకోజెబ్‌ను పిచికారీ చేయాలి. బీర, కాకర పంటలకు బూజు తెగులు నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాముల డైమిథోమర్ఫ్ లేదా లీటరు నీటికి 2 గ్రాముల మెటాలాక్సిల్, మంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి. టమాట, వంగ పంటలకు సోకే బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, 2 గ్రాముల ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

– కె.దివ్యశ్రీ, ఉద్యానశాఖ అధికారి, ప్రత్తిపాడు

### కౌన్సిల్ సమావేశం వాయిదా

ఏలేశ్వరం: సమస్యలు ప్రస్తావించకుండా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రెండురోజుల క్రితం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ ఏసీబీ అధికారులకు చిక్కడం, సీఎం చంద్రబాబు పర్యటనతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించింది. సమస్యలు ప్రస్తావన లేకుండా సమావేశం ముగిసింది. అజెండాలోని అంశాలను తరువాత సమావేశంలో ప్రస్తావిస్తామని చైర్‌పర్సన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, సామంతుల హైమావతి, కోరాడ రామలక్ష్మి, వాగు బలరామ్ పాల్గొన్నారు.

### వైభవంగా దుర్గమ్మ సంబరం



తాళ్లూరులో గరగలు నెత్తిన ధరించి ఊరేగుతున్న మహిళలు

గండేపల్లి: తాళ్లూరులో దుర్గమ్మ సంబరం శనివారం వైభవంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా మేళతాళాలతో, భక్తజన సందోహం నడుమ గరగ నాట్యాలు, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారికి గ్రామంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నిర్మాణం జరిగినప్పటి నుంచి ఏటా ఉత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

## ప్రజాసమస్యలపై వెంటనే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రజాసమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలన్నారు. తూర్పులక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీకి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ హామీ మేరకు 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఎంపీటీసీల గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. తిరుమాలి సర్పంచ్ సూతిప్రసాద్ మాట్లాడుతూ రైతుల సమస్యలపై అధికారులు తీరు తప్పుపట్టారు. సిరిపురంలో సచివాలయ సిబ్బంది కొరత నెలకొందని సర్పంచ్ పీతల సూకరాజు అన్నారు. ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంపై తీర్మానం చేయాలని ఎంపీపీ సూచించారు. సర్పంచ్‌లు కూనపురెడ్డి సుబ్బారావు, బుద్దా సూర్యప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ పలుసమస్యలు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సాదే లోవరాజు, లింగంపర్తి పీఏసీఎస్ చైర్మన్ పెంటకోట మోహన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ప్రత్తిపాడు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: వివిధ శాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో ఎరువులు అత్యవసరమైనా వ్యవసాయశాఖ సరఫరా చేయదు, ఫోన్ చేసినా విద్యుత్ శాఖాధికారులు స్పందించరు, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు అలసత్వం వీడదంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలాధ్యక్షుడు గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో ఆయా శాఖల సమస్యలు చర్చకు వచ్చినప్పుడు సభ్యులు విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగానికి కొరత లేదని, ప్రస్తుతం ఎరువులు లేక రైతులు యాతన పడుతున్నారని ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు వచ్చిన వెంటనే రైతులకు సరఫరా చేస్తామని వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయని, రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని సభ్యులు ఆరోపించారు. గజ్జనపూడిలో ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేయలేదని సర్పంచ్ గొనగాల అప్పలరాజు అన్నారు. ధర్మవరంలో నివాసాలకు సమీపాన సర్వే నంబర్ 402లో ఉన్న శ్మశానభూమికి ప్రహరీ నిర్మించాలంటూ సర్పంచ్ జువ్వల సుజాతావాణి కోరారు. సమావేశానికి రాకుండా ఐసీడీఎస్ సీడీపీఓ అసిస్టెంట్‌ను పంపడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే యూనిట్లు సబ్సిడీపై మంజూరు చేస్తామని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. సమావేశాలకు గైర్హాజరవుతున్న ముఖ్యశాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న) డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాగునీరు, ఇంజినీరింగ్, విద్యా తదితర శాఖలపై సమీక్షించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: విద్యారంగ సమస్యలు తీరుస్తామంటూ కూటమి నేతలు ఇచ్చిన మాట అధికారంలోకి రాగానే విస్మరించారంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తల్లికి వందనం సగం మందికి కూడా అందలేదంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ప్రత్తిపాడులో ఆందోళన నిర్వహించారు. ర్యాలీ, మానవహారం, ధర్నా వంటి ఆందోళనలు చేపట్టారు. విద్యార్థులు చేపట్టిన ర్యాలీ స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి పోలీస్ స్టేషన్, బజారు, మెయిన్‌రోడ్డు మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్‌కు చేరుకుని, మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అంబేడ్కర్ కళామందిర్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా విద్యారంగ సమస్యల ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు.ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం సూర్యప్రభకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె సిద్ధు, మండల కార్యదర్శి చవాకుల నరసింహ మూర్తి, శివమణి, భానుబాబు, నాని ఆశోక్, హరి, పండు, వంశీ, రాణి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతలకు సన్మానం



ఏలేశ్వరంలో అవార్డు గ్రహీతలను సన్మానం

ఏలేశ్వరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న అధికారులకు పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

### రేషన్ పంపిణీపై డీలర్లతో తహసీల్దార్ సమావేశం

గోకవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ రామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో సరికొత్త విధానాలను అవలంబిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు స్థానంలో త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తుందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈనెల 25న వృద్ధులకు, వితంతువులకు రేషన్ పంపిణీతో పాటు స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుందన్నారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బుంగ రాజు. సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి వి కన్వెన్షన్ హాలులో «బాబు షూ్యరిటీ– మోసం గ్యారంటీ» కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం మూడు గంటలకు నిర్వహిస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ముద్రగడను కలిసిన వెంకట్రాయుడు



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన చిన్నమిల్లి వెంకట్రాయుడు తదితరులు

కిర్లంపూడి: మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును భీమవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చిన్నమిల్లి వెంకట్రాయుడు శనివారం కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పిఠాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ముద్రగడను కలిసిన వారిలో ఉన్నారు.

## యూరియా కొరతను నివారించాలి

ప్రత్తిపాడు: జిల్లాలో యూరియా కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలూరి పతిరాజు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయంలో శనివారం బీకేఎస్ జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొలూరి పతిరాజు మాట్లాడారు. బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 29న రైతులంతా భగవాన్ బలరామ జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహించాలని కోరారు. విద్యుత్ లైన్లు ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తున్నారని దీనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, వేలంక మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ కిర్లంపూడి మండలంలోని గోనేడ, పాలెం, సోమరాయునిపేట గ్రామాల్లో గతేడాది డిసెంబర్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో బీకేఎస్ ప్రతినిధులు కంపరపు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రచారక్ కొండబాబు, ఆకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో యువకుల ప్రతిభ



పైల శివకుమార్



వై. పంపా ప్రసాద్



మనిమెల గోవిందు



పి. రామకృష్ణ

రౌతులపూడి: ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో బలరామపురానికి చెందిన పైల శివకుమార్ ఫిజికల్ సైన్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 6, జోన్‌లో 2వ ర్యాంకు సాధించాడు. టీజీటీ సైన్స్‌లో రాష్ట్రంలో 5, జోన్‌లో ప్రథమ ర్యాంకు సాధించాడు. పీజీటీ ఫిజికల్ సైన్స్‌లో జోన్ 3, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో అర్హత సాధించాడు.

**రైతు కుటుంబం నుంచి ...**

తొండంగి: సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వేమవరానికి చెందిన యనమల పంపా ప్రసాద్ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్‌లో) జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు సాధించారు. ప్రసాద్ తండ్రి యనమల వీర్రాజు, తల్లి అప్పలకొండ వ్యవసాయం చేస్తూ ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలను చదివించారు. పెద్దకుమారుడు కృష్ణ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. రెండవ కుమారుడు సత్తిబాబు వ్యవసాయం చేస్తున్నాడు. 2019లో ప్రసాద్ సచివాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికై ఉద్యోగం చేస్తున్నారు.

**మనిమెల గోవిందుకు పదవ ర్యాంకు**

డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) విభాగంలో మండలంలోని గోర్సపాలెంకు చెందిన మనిమెల గోవిందు జిల్లా స్థాయిలో పదవ ర్యాంకు సాధించాడు. తండ్రి అప్పారావు, తల్లి సుభద్ర దంపతులకు ముగ్గురు కుమారులు. అప్పారావు వ్యవసాయ కూలీగా చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. మూడవ కుమారుడైన గోవిందు డీఎస్సీ పరీక్షలో ప్రతిభ కనబరిచి ర్యాంకు సాధించారు.

**రామకృష్ణకు జిల్లా ప్రథమ స్థానం**

తుని రూరల్: ఇటీవల విడుదలైన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో తుని మండలం చేపూరుకు చెందిన పక్కుర్తి రామకృష్ణకు టీజీటీ విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమ స్థానం లభించింది. రాష్ట్రస్థాయిలో 17, జోన్–2లో 4, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లో ప్రథమ స్థానం లభించడంతో రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు పక్కుర్తి రమణ, సుశీల దంపతులకు మూడవ సంతానంగా రామకృష్ణ జన్మించాడు. అదే గ్రామంలో నాన్నమ్మ అప్పలకొండ వద్ద ఉంటూ తునిలో విద్యాభ్యాసం పూర్తి చేశారు.

## తాగునీరందక ఇక్కట్లు



బలరామపురంలో కోనేరు వద్ద మంచినీటి బావిని పరిశీలిస్తున్న చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు

రౌతులపూడి: ఇటీవల బలరామపురం కోనేరువద్ద ఉన్న తాగునీటి బావుల్లో నీరు కలుషితమవ్వటంతో దాహార్తితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని ఎస్సీపేట వాసులు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌ను కోరారు. ఎన్నో ఏళ్లుగా కోనేరు వద్ద బావుల్లోని నీటినే తాగేందుకు వాడుతున్నామని దళితులు అన్నారు. ఐదురోజుల క్రితం కోనేరులో చేపలు మృతిచెందడంతో కోనేరు ఆనుకుని ఉన్న బావుల్లోని నీరు కలుషితమైందని తెలిపారు. కోనేరు, బావుల్లోని నీటిని తొలగించాలని వారు డిమాండ్ చేస్తూ దళితులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. డీజిల్ ఇంజిన్‌ను ఏర్పాటు చేసి అధికారులు తూతూ మంత్రంగా కోనేరులోని నీటిని తొలగిస్తున్నారని ఆరోపించారు. దళితపేటలో పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు లవుడు శ్రీను, మానెల్లి వెంకటరమణ, ఎయిమ్స్ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోటనందూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై నినాదాలు చేసారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్లలోని చెత్తను రోడ్లు, బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ సిబ్బందికి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ జయరాం, ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

ప్రత్తిపాడు రూరల్: వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అన్నారు. ధర్మవరంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రం చేసి, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. డిప్యూటీ ఎంపీటీఓ కాశీవిశ్వనాథ్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బలక్ష్మి, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**బహిరంగ ప్రదేశంలో వైద్య వ్యర్థాలు**

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం చెరువు గట్టును ఆనుకొని ఉన్న పొలాల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రుల్లో వినియోగించిన వైద్య వ్యర్థాలను పారవేశారు. బహిరంగ ప్రదేశాల్లో వైద్య వ్యర్థాలను పారవేయడం వల్ల ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**లింగంపర్తిలో ర్యాలీ**

ఏలేశ్వరం: లింగంపర్తిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రతిజ్ఞ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని పలుగ్రామాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, నూకతాటి ఈశ్వరుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తలుపులమ్మను దర్శించిన ఆర్టీసీ ప్రిన్సిపాల్ సెక్రటరీ

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైఉన్న తలుపులమ్మవారిని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రాంతిలాల్ దండే దర్శించుకున్నారు. శనివారం దేవస్థానానికి వచ్చిన ప్రిన్సిపాల్ సెక్రటరీ దంపతులకు ఆలయ మర్యాదలతో అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేసిన క్రాంతిలాల్ దండే దంపతులకు వేద పండితుల, ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**లోవ దేవస్థానంలో స్వచ్ఛ భారత్**

తలుపులమ్మ లోవ దేవస్థానంలో కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది కొండపైన, దేవస్థానం ప్రాంగణంలో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. డ్రెయినేజీలను శుభ్రపర్చారు. ముందుగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.